ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023 5
పార్వతీపురం మన్యం

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించారు. హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచివెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు

కమాండో ఎక్కుతున్న చిన్నారి

ఐసిడిఎస్ పరిరక్షణ, వేతనాల పెంపు కోసం..

అంగన్వాడీల ఆందోళనబాట

అమ్మ తరువాత అమ్మలై... ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్రదారులై... చివరికి ఉద్యోగ భద్రతకు నోచుకోక, గౌరవ ప్రదమైన వేతనాలూ అందుకోలేక, రాజకీయ వివక్షతో కొట్టుమిట్టాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మరో పోరాటానికి సిద్ధమయ్యారు. అందుకు సన్నద్ధంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఈనెల 10,11 తేదీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం కలెక్టరేట్ల వద్ద 36 గంటల పాటు మహాధర్నా చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. సోమవారం ఈ రెండు జిల్లాల కలెక్టరేట్లకు అంగన్‌వాడీలు తరలి రానున్నారు. ఇప్పటికే ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దీక్షలకు సంబంధించిన సన్నాహాలు చేశారు.

చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్త

- నేటి నుంచి కలెక్టరేట్ ఎదుట 36 గంటల మహాధర్నా
- తరలిరానున్న అంగన్‌వాడీలు, ఆయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాలో 10 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 14,00 అంగన్‌వాడీకేంద్రాలు, 60 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తల్లిపిల్లల ఆరోగ్య పరిరక్షణలోనూ, చిన్నారుల ఆలనపాలనలోనూ నిత్యం తలమునకలై పనిచేస్తున్న అంగన్‌వాడీలకు అన్నింటా సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు కావస్తున్నా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాకపోగా, మరింత జఠిలమయ్యాయి. ఐసిడిఎస్‌కు నిధులు పెంచాల్సింది పోయి, కుదిస్తోంది. లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చింది. ఈ కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు నయా పైసా కూడా పెంచలేదు.

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా 2018లో అంగన్వాడీ వర్కర్లకు 1500, హెల్పరుకు రూ.750, మినీ వర్కరుకు రూ.1250 పెంచుతున్నట్లు ప్రకటన చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దశాబ్దాలు తరబడి పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా రూ.11,500, ఆయాలకు రూ.7,500 మాత్రమే అందుతున్నాయి. వేతనాలు పెంచుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకసార్లు హామీలు ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలని అనేక సార్లు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వానికి చలనం రాలేదు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు కమర్షియల్ కేటగిరి కింద మీటర్లు మార్చడంతో అధిక బిల్లులు వస్తున్నాయి. ఈ బిల్లులతోపాటు అద్దెలు సకాలంలో విడుదల చేయడం లేదు. విధుల్లో చేరినప్పటి నుంచీ గ్రాట్యుటీ చెల్లించాలంటూ 2022 ఏప్రిల్ 25న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలుకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్‌ను తీసుకువచ్చింది. ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారు. మరోవైపు ఆగస్టు నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం పంపిణీని నిలిపివేసి, ఇంటింటి రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి 36గంటల ధర్నాకు పిలుపునిచ్చారు.

ఇవీ డిమాండ్లు

- ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలి
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలి
- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- హెల్పర్ల ప్రమోషన్లకు వయసు 50ఏళ్లకు పెంచాలి.
- రాజకీయ జోక్యం అరికట్టాలి
- పిల్లలకు అమ్మఒడి, యూనిఫారం ఇవ్వాలి
- సర్వీసులో ఉండి చనిపోయిన కార్యకర్తల కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న డిఎ బిల్లులు ఇవ్వాలి.
- వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలి.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం

సమస్యలు పరిష్కారం చేసేవరకు పోరాడతాం. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. కనీస వేతనాలు అడుగుతున్నాం. ప్రభుత్వానికి కొంత చాకిరీ చేసినందుకు ఉద్యోగులుగా గుర్తించమంటున్నాం. ఐసిడిఎస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడం తగదు. ఇటువంటి చర్యల వల్ల తమ ఉద్యోగ భద్రతకు ముప్పువాటిల్లడంతోపాటు తల్లి, పిల్లలకు, గర్భిణుల ఆరోగ్యానికి రక్షణ ఉండదు. ఈనేపథ్యంలో చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం దిగిరాకపోతే మరింత ఉధృతం చేస్తాం.

\- గంట జ్యోతి లక్ష్మి,
ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రోగులతో కిటకిటలాడుతున్న కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం

మన్యంలో ముసురుతున్న జ్వరాలు

విజృంభిస్తున్న వ్యాధులు • రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంతో పాటు ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో జ్వర తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా గ్రామాల్లో జ్వరపీడితులు ఎక్కువయ్యారు. ప్రతి ఇంటికి ఇద్దరు, ముగ్గురు జ్వరం బారిన పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా జ్వరాలు ఎక్కువ కావడం వల్ల ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోగులు ఎక్కువ మంది కావడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఇదే అవకాశం చేసుకున్న ఆర్ఎంపి వైద్యులు ఏజెన్సీ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణ జ్వరమైనప్పటికీ అనేక రకాల పరీక్షలు నిర్వహించి వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. అవసరం లేకపోయినా వివిధ పరీక్షల పేరుతో పరీక్షలు జరిపి ప్రయివేటు ల్యాబ్ నిర్వాహకులు వేల రూపాయలు ఫీజు తీసుకుంటున్నారు. డెంగీ పరీక్షకు రూ.800, టైఫాయిడ్‌కు రూ.300, మలేరియాకు రూ.300 చొప్పున వసూలు చేస్తున్నారు. రోగనిర్ధారణ పేరిట గిరిజనులను నిలువునా దోచుకుంటున్నారు. గ్రామాల్లోకి వెళ్లి సేవలు అందించాల్సిన వైద్య సిబ్బంది తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడం, ముందస్తు శానిటేషన్ చర్యలు చేపట్టక పోవడం, జ్వరాలపై అవగాహన కల్పించకపోవడం వల్ల ఆర్ఎంపి వైద్యులు భారీగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్ఎంపి వైద్యశాలతో పాటు ప్రతి వైద్యశాల కిక్కిరిసిపోయి ఉండడం ఏజెన్సీ గ్రామాల్లోని జ్వరాల తీవ్రతను తెలియచేస్తుంది. గ్రామాల్లో ఒకే ఇంట్లో ఇద్దరు లేక ముగ్గురు జ్వరంతో బాధ పడుతుండడంతో వారి ఉపాధికి కూడా ఆటంకంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో వైద్యం శిబిరాలు ఏర్పాటు చేసి అధిక నగదు వసూలు చేస్తున్న ఆర్ఎంపి వైద్యులపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు తీవ్రతతో బాధపడుతున్నారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందకపోవడం వల్ల ఆర్ఎంపి వైద్యులు ఆశ్రయించి వేలాది రూపాయలు తగలబెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడాలి.

\- కె.అవినాష్. గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపట్టాలి

వర్షాకాలం సంభవించిన నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు తీవ్రతతో ఏజెన్సీ గ్రామాల్లో పెరుగుతుండడం వైద్య సిబ్బంది అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపట్టాలి. వైద్య సిబ్బంది కేవలం మలేరియా తీవ్రత ఉన్న నాలుగు గ్రామాలకే స్ప్రేయింగ్ చేపడతామనడం సమంజసం కాదు. వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి అన్ని గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపట్టి దోమలను నివారించి ప్రజలు జ్వరాల బారిన పడకుండా చూడాలి.

\- ఎం. శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి, కురుపాం

జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబసు

ప్రజాశక్తి - బెలగాం

పేదలు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిబసు అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో పశ్చిమబెంగాల్ మాజీ సిఎం జ్యోతిబసు 109 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ పేదల కోసం, బడుగు, బలహీన వర్గాలు, దళిత గిరిజనుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. విదేశాల్లో చదువుకొన్న ఆయన స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వరాజ్యం కోసం రైతుల్ని, కార్మికుల్ని పెద్ద ఎత్తున కదిలించి పోరాడిన యోధుడన్నారు. 24ఏళ్ల పాటు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా ఉంటూ ఆ రాష్ట్రాన్ని భారతదేశంలోని ఆదర్శ రాష్ట్రంగా నడిపిన వ్యక్తి పేదలకు భూమి పంచారన్నారు. కౌలు రైతులకు కౌలుదారులు చట్టం తీసుకొచ్చి న్యాయం చేశారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని, పార్టీ విధానానికి లోబడి పని చేశారని, ఈరోజు ఆయన లేకపోయినా ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.మన్మథరావు, ఆర్.శ్రీదేవి, వి.ఇందిర, సుందరమ్మ, పి.వరాలు, పి.రాము, తులసి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు రామారావు మాస్టారు

ప్రజాశక్తి - సీతంపేట

తోటి ఉపాధ్యాయులకు ఆదర్శనీయుడు రామారావు మాస్టారని ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు అన్నారు. మండలంలో పూలిపుట్టి పంచాయతీ ఆనపకాయలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంపిలి రామారావుకు మండ కాలనీలో పాఠశాలకు బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. తొలుత ఆ గ్రామ గిరిజనులు మేళతాళాలతో, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో స్వాగతం పలికారు. కాలు కడిగి ఊరంతా భుజంపై కూర్చుని పెట్టి ఊరేగించారు. అనంతరం జరిగిన సభలో ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ప్రజల మన్ననలు ఇంతగా పొందడం గొప్ప విషయమన్నారు. ఉపాధ్యాయుడిగా ఇక్కడ గిరిజనులకు ఐదేళ్లగా అనేక సేవలు అందించారని, అందుకే ఇక్కడ ప్రజలు బ్రహ్మ రథం పట్టారని కొనియాడారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు హారిక భాస్కర రావు, కార్యదర్శి సింహాచలం, ప్రకాశం, కె.పారయ్య, కాంతారావు, కృష్ణారావు, ఈదపురం ప్రధానోపాధ్యాయులు బి. రా వ రా రా వు, పాలకొండ యుటిఎఫ్ మండల కార్యదర్శి పి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

రామారావును భుజాలపై మోస్తూ ఊరేగిస్తున్న గిరిజనులు

అధిక మొత్తంలో వచ్చిన బిల్లులు చూపుతూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

విద్యుత్తు భారాలు మోపడం సరికాదు

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని పలగారలో ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వచ్చే విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ ఎప్పుడూ లేనంతగా కరెంటు బిల్లులు వచ్చాయని సిపిఎం నాయకులకు చెప్పారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ట్రూఆప్, సర్దుబాటు, సర్‌ఛార్జీ, కస్టమర్ ఛార్జీలు ఇలా అనేక రకాలుగా ప్రజలపై విద్యుత్తు భారాలు వేయడం సరికాదన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యవసర వస్తువు సరుకుల ధరలు విపరీతంగా పెరిగితే ఇప్పుడు ప్రభుత్వం ప్రజలపై ఇలాంటి భారాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం పెరిగిన బిల్లులతో పలగరలో గ్రామస్తులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బద్దన భానుమూర్తి, మజ్జి సన్యాసి, అల్లాడి కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, వినియోగదారులు పాల్గొన్నారు.



పోరుయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు, కార్యకర్తలు

మహిళలపై హింసకు వ్యతిరేకంగా

28 నుంచి పోరుయాత్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఈనెల 28 నుంచి ఆగస్టు 9వరకు పోరుయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రెడ్డి శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో పోరుయాత్రకు సంబంధించిన కరపత్రాలను మహిళా నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులు, మహిళలపై హింస, హత్యలు, అత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆఖరుకు ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన మహిళా మల్లయోధులు ఢిల్లీలో వారు చేసిన ఆందోళనే ఇందుకు ఒక నిదర్శనమన్నారు. మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. మహిళల కోసం, మహిళా సాధికారత కోసం అనేక చట్టాలు తీసుకొస్తామని చెబుతూనే మహిళలకు రక్షణ లేదన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై హింస మరింత పెరిగిందన్నారు. బిజెపి ఎంపి బ్రిజిభూషన్ లాంటివారు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినా కేంద్రం పట్టించుకోవడంలేదన్నారు. అలాగే చిన్నారులపైన యథేచ్ఛగా దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా దిశ, నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని వచ్చినా మహిళలకు రక్షణ లేదన్నారు. కావున మహిళల సమస్యలపై పోరుయాత్ర రాష్ట్రవ్యాప్తంగా సాగుతుందని, అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 3న జరుగుతుందని, ఇందులో మహిళలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.రామలక్ష్మి, జి.తులసి, జె.సుందరమ్మ, పి.వరాలు, జి.పార్వతి, మాలతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూ.9065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.9065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని లీడ్‌బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇందులో ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు చొప్పన కేటాయించినట్లు చెప్పారు. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.5,823 కోట్లు, ఇందులో పంట రుణాలు రూ.3,432 కోట్లు చొప్పన విభజించినట్లు వివరించారు. వీటితోపాటు వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌లకు విరివిరిగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈసారి దీర్ఘకాలిక రుణాలకు కూడా ఎక్కువ మొత్తంలోనే కేటాయింపులు జరిగాయని, వీటన్నింటినీ రైతులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు పెడదామనుకునేవారు ఉపయోగించుకోవాలని కోరారు. తనను కలిసిన ప్రజాశక్తికి ఎల్‌డిఎం ఎ.శ్రీనివాసరావు ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475 కోట్లు
- ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు
- అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.5,823 కోట్లు
- పంట రుణాలు రూ.3,432 కోట్లు
- ప్రజాశక్తితో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు ముఖాముఖి

ఈ ఏడాది రుణ ప్రణాళిక ఏ విధంగా ఉంది?

వార్షిక రుణ ప్రణాళిక గతంతో పోలిస్తే బాగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం రూ.7509కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించాం. లక్ష్యానికి మించి (106.1శాతం) రూ.7,975 కోట్ల మేర రుణాలు అందజేశాం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.9,065 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించాం. ఇందులో ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ.1,590 కోట్లు చొప్పన కేటాయించాం.



వ్యవసాయ రంగానికి ఎంత ప్రాధాన్యత?

మొత్తం కేటాయింపులో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. మొత్తంగా రూ.5,823కోట్లు కేటాయించగా ఖరీఫ్ పంట రుణాలకు రూ.2,025 కోట్లు, రబీ పంటలకు రూ.1,407 కోట్లు చొప్పన అందజేయాలని జిల్లా అధికార యంత్రాంగం, వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. ఇవి కాకుండా రైతులకు రూ.2,136 కోట్ల మేర దీర్ఘకాలిక రుణాలు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ గిడ్డంగులు, వాటర్‌షెడ్, బయోగ్యాస్ వంటి రూపాల్లో అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా డవలప్‌మెంట్ కోసం రూ.101కోట్లు, అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్స్, అగ్రి సొసైటీలు, మైక్రో ఫైనాన్స్ తదితర రూపాల్లో రూ.154కోట్లు చొప్పన అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఇతర ప్రాధాన్యతా రంగాలకు కేటాయింపులు ఎలా ఉన్నాయి?

వ్యవసాయ రుణాలతోపాటు స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్నపరిశ్రమల ఏర్పాటు తదితరాలన్నింటినీ ప్రభుత్వం ప్రాధాన్యతారంగాలుగా భావిస్తుంది. మొత్తం ప్రాధాన్యతా రంగాలకు రూ.7,475కోట్లు కేటాయించగా, ఇందులో వ్యవసాయరంగం మినహా మిగిలిన వాటికి రూ.441కోట్లు, కేవలం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.1,211 కోట్లు కేటాయించాం. రూ.20లక్షల నుంచి రూ.25లక్షలు దాటిన హౌసింగ్, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్స్ తదితరాలు ప్రాధాన్యేతర రంగాల్లోకి వస్తాయి. వీటికి రూ.1,590కోట్లు కేటాయించాము.

కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉందా?

కౌలు రైతులకు కూడా తప్పకుండా బ్యాంకు ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంది. కౌలు రైతులకు సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు)లను రెవెన్యూ అధికారులు జారీచేస్తున్నారు. వీటి ఆధారంగా బ్యాంకులో పంట రుణాలు పొందేందుకు సౌలభ్యం ఉంది. జిల్లాలో 10,176 మంది కౌలు రైతులు ఉన్నట్టు సమాచారం. వీరిలో 1180మందికి సిసిఆర్‌సి కార్డులు ఉన్నాయి. వీరంతా నిరభ్యంతరంగా రుణాలు పొందవచ్చు. వీరికోసం ఈ ఏడాది రూ.34కోట్లు కేటాయించడం జరిగింది. వీరి మాదిరిగానే ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 195మంది చేనేత కార్మికులకు రూ.97.50కోట్లు కేటాయించాం.

బ్యాంకు లింకేజీ రుణాల పరిస్థితి ఎలా ఉంది?

బ్యాంకు లింకేజీ రుణాలు కూడా ఏటా లక్ష్యానికి మించి ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో రూ.1,042కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయాలని లక్ష్యం పెట్టుకోగా ఆచరణలో రూ.1,170కోట్ల మేర ఇచ్చాం. పట్టణ ప్రాంతాల్లో రూ.175కోట్లకు గాను రూ.243కోట్లు పంపిణీ చేశాం. ఈ ఏడాది (2023-24వ ఆర్థిక సంవత్సరం) గ్రామీణ ప్రాంతంలో 1,765కోట్లు, పట్టణ ప్రాంతాల్లో రూ.349కోట్లు మేర రుణ సదుపాయం కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించాం. ముద్రా లోన్లు గత ఏడాది జిల్లా వ్యాప్తంగా రూ.360కోట్ల మేర ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.289కోట్లు (80శాతం) మేర రుణాలు అందజేశాం.

మంత్రి బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజన్నదొర

ఘనంగా మంత్రి బొత్స జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. మంత్రి బొత్సకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆయన నివాసంలో కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బడుకొండ అప్పలనాయుడు, కంబాల జోగులు, మన్యం జిల్లాకు చెందిన మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, రఘురాజు, పెనుమత్స సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, నగరంలోని పలువురు కార్పొరేటర్లు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం డిఆర్‌ఒ గణపతిరావు, పార్వతీపురం డిఆర్‌ఒ వెంకటరావు, ఆర్‌డిఒ సూర్యకళ తదితర అధికారులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంత్రి బొత్సతో కేక్ కట్ చేయించారు. మంత్రి సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మి, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న జమ్మాన ప్రసన్నకుమార్

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని గిరిజన గ్రామాలైన ములగ, పిండిలోవ, వెలగవలస ఆదివారం జరిగిన గ్రామసందర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులై ఉండి ఎవరైనా సంక్షేమ పథకాలు అందని ప్రజలకు సమస్యల పరిష్కారానికి ఈ క్రమం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నిజం చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం కావాల్సినా తన దృష్టికి తీసుకొని వస్తే వాటిని తప్పక ప్రభుత్వ పెద్దల సహాయంతో వాటిని పరిష్కరించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాచైతన్యయాత్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని సీతానగరం, పార్వతీపురం మండలాల్లో సోమవారం నుంచి జరిగే టిడిపి ప్రజాచైతన్య బస్ యాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట జరిగే ప్రజాచైతన్య బస్‌యాత్ర సోమవారం ఉదయం 10గంటలకు సీతానగరం మండలంలో అడుగుపెట్టడం ద్వారా నియోజకవర్గంలో ప్రవేశిస్తుందన్నారు. లచ్చయ్యపేట చక్కెర కర్మాగారం ఎదుట చక్కెర రైతులతో ముఖాముఖి ఉంటుందని, అనంతరం సువర్ణముఖి నదిపై అసంపూర్తిగా మిగిలి ఉన్న వంతెన నిర్మాణ పనులు పరిశీలన, సీతానగరం ఆరోగ్యకేంద్రం సందర్శనతో పాటు టిడిపి హయాంలో నిర్మించిన రైల్వేఓవర్ బ్రిడ్జి దగ్గర సెల్ఫీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రాథమిక పాఠశాల పరిశీలిన, చినబొండపల్లి జంఝావతి కాలువ పరిస్థితిపై సమీక్ష, అనంతరం మధ్యాహ్నం లయన్స్ కల్యాణమండపంలో కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో సమావేశం, అనంతరం పార్వతీపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి, టిడ్కో ఇళ్లు సందర్శన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, బేబినాయన, గుమ్మడి సంధ్యారాణితో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొంటారని, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, జి. రవికుమార్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు తక్షణమే వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు సుజాత, తవుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు 15నెలలుగా ప్రభుత్వం చాకిరీ చేయించుకుంటుందన్నారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ఆరికతోటలో పనిచేస్తున్న మామిడి గౌరు అనే గ్రీన్ అంబాసిడర్ జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతి చెందిన గౌరు కుటుంబానికి ప్రభుత్వం రూ. 10లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గ్రీన్ అంబాసిడర్లకు 14 నెలలుగా బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని లేనిచో గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ నాయకులు సింహాచలం, సునీల్, నవీన్ పాల్గొన్నారు.

టిడిపి విజయానికి కృషి

ప్రజాశక్తి - భామిని

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణకు ఎంఎల్‌ఎ టికెట్‌పై పూర్తి స్థాయిలో అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన నేపథ్యంలో మండల టిడిపి నాయకులు జయకృష్ణను కలిసి అభినందనలు తెలిపారు. పాలకొండలో టిడిపికి పూర్వ వైభవం వస్తుందని, మండల స్థాయిలో టిడిపి కేడర్ అందర్నీ కలుపుకొని వెళ్లాలని, మీ సహకారంతో రాబోయే ఎన్నికల్లో పాలకొండలో టిడిపి జెండా ఎగరాలని భామిని టిడిపి కమిటీ సభ్యులు, కార్యకర్తలకు తెలిపారు. కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, బిడ్డికి ప్రసాద్, కోరాడ రాజేష్, గురిబిల్లి లక్ష్మీపతి, కోరాడ వెంకట రవాణా, సాకేటి రామారావు, టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

జయకృష్ణను అభినందిస్తున్న టిడిపి మండల నాయకులు

నవరత్నాలు కాదు.. నకిలీ రత్నాలు

- సైకో జగన్ మళ్లీ సిఎం అయితే నిలువుదోపిడీనే
- డిప్యూటీ సిఎం చేసిన అభివృద్ధి పనులేవీ?
- వంద పడకల ఆస్పత్రిని అసంపూర్తిగా వదిలేశారు
- రాష్ట్ర భవిష్యత్తు కోసం బాబు సిఎం కావాలి
- బస్సుయాత్రలో టిడిపి రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నవరత్నాలు కాదని, నకిలీ రత్నాలని టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు వంగలపూడి అనిత అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన సభలో మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, కెఎ నాయుడు, తెంటు లక్ష్మునాయుడు, భంజ్ దేవ్, విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాం మల్లిక్ నాయుడు, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత వెంకటేశ్వరాలయాన్ని దర్శించారు, అనంతరం డీలక్స్ సెంటర్‌లధున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత నిర్మాణంలో ఉన్న వందపడకల ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. ఈ సభలో అనిత మాట్లాడుతూ కుటుంబంలో చదువుతున్న పిల్లలందరికీ అమ్మ ఒడి మంజూరు చేస్తానని చెప్పిన సిఎం జగన్ మోహన్ రెడ్డి ఒక బిడ్డ కే మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇద్దరు, ముగ్గురు బిడ్డలున్న పేదకుటుంబంలో మిగిలిన పిల్లలను ఎలా చదివించుకుంటారని ప్రశ్నించారు. అందుకే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ అమ్మఒడి వర్తింపజేయనున్నారని చెప్పారు. జగన్ పాదయాత్రలో 45 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ పింఛను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ మాట తప్పి మడమ తిప్పారని ఎద్దేవా చేశారు. ఒక ఇంట్లో ఎంతమంది మహిళలుంటే అంతమందికీ నెలకు రూ.1500 చొప్పున మంజూరు చేయాలని టిడిపి నిర్ణయించినట్లు చెప్పారు. పెట్రోల్, డీజిల్ ,గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, అందుకే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ పంపిణీ చేయాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్, బస్సు ఛార్జీలు భారీగా పెరిగాయని, పేదలపై పెనుభారం పడిందని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు చెప్పారు. 2009నుంచి టిడిపి ఈ నియోజకవర్గంలో ఓడిపోతోందని, ఈ సారి టిడిపి ని గెలిపించాలని కోరారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నియోజకవర్గంలో కనీసం గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించలేదన్నారు. గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు భూకబ్జాలు, ఇసుక, మట్టి దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సైకో జగన్ మళ్లీ సిఎం అయితే ప్రజలు నిలువుదోపిడీ చేస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని చెప్పారు. సబ్ ప్లాన్ నిధుల్లేక ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పనులు లేవని చెప్పారు. సాలూరు నియోజకవర్గంలో సంధ్యారాణిని గెలిపిస్తే మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్‌కి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఆ దిశగా గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలని లలిత కుమారి కోరారు. మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు మాట్లాడుతూ పట్టణంలో వందపడకల ఆసుపత్రిని గతంలో టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇంత వరకు డిప్యూటీ సిఎం రాజన్నదొర ఎందుకు దాని నిర్మాణం పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొర నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే వారిపై వైసిపి బెదిరింపులకు పాల్పడుతోందని అన్నారు. యువతకు ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తామని చెప్పిన సిఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల లో యువకులకు గంజాయి, మద్యం సరఫరా చేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు టిడిపిని అధికారంలోకి తేవాల్సిన అవసరం వుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ కావాలని అడిగి అధికారంలోకి వచ్చిన వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. సాధ్యం కాని హామీలిచ్చి మోసగించారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం జగన్ చేసిన మొదటి ఘనకార్యం అమరావతిలో ప్రజావేదిక కూల్చివేత అని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రివర్స్ టెండర్ పిలిచి నిర్మాణపురోగతి అడ్డుకున్నారని చెప్పారు. హైకోర్టు, సుప్రీంకోర్టు లు ఎన్ని మొట్టికాయలు వేసినా సిఎం జగన్ కి సిగ్గు ఎగ్గూ లేదన్నారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ఉండీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించారు. కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు వేగంగా జరగడంలేదన్నారు. ఇప్పటివరకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారారని చెప్పారు. గిరిజన యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పనకు శిక్షణ ఇవ్వడానికి నిర్దేశించిన వైటిసిని ప్రభుత్వం గాలికొదిలేసినట్లు చెప్పారు. గిరి శిఖర గ్రామాల కు చెందిన గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్‌ను నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. విజయనగరం జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో సరైన నాయకులు అధికారం ఉంటే పాలన బాగుంటుందని చెప్పారు. గడిచిన నాలుగేళ్ల లో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. సిఎం జగన్ మూడు రాజధానులు నిర్మిస్తామని చెప్పి అసలు రాజధాని లేకుండా చేశారని చెప్పారు. ప్రజలు సంక్షేమ పథకాలతో పాటు అభివద్ధి పనులు కూడా కోరుతున్నారని చెప్పారు. సిఎం గత ఎన్నికల ముందు సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి రెడ్డిని చంపించి టిడిపి నాయకులపై నేరం పెట్టారని చెప్పారు. సంపూర్ణ మద్యనిషేధం పేరుతో రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజన్నదొర నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కనీసం రోడ్లు కూడా నిర్మించలేదన్నారు. ఆయనకు డిప్యూటీ సీఎం బోర్డు తగిలించి వదిలేశారని ఎద్దేవా చేశారు. టిడిపి ప్రభుత్వం హయాంలో పేదల కోసం అన్నా కేంటీన్లు ఏర్పాటు చేస్తే జగన్ ప్రభుత్వం ఎత్తివేయడం దారుణమని అన్నారు. నిరుపేదలకు కడుపునిండా తిండి పెట్టకపోవడం ద్వారా జగన్ శాడిజం బయటపడిందని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ బస్సు యాత్రకు స్పందన అంతంతమాత్రమేనని తెలుస్తోంది. బస్సు యాత్రలో పాల్గొన్న కొంత మంది సీనియర్ నాయకులు సభకు హాజరు కాలేదు.

సభలో మాట్లాడుతున్న తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులు అనిత

ఎందుకింత నిర్లక్ష్యం

- మందకొడిగా వెల్‌నెస్ సెంటర్ల పనులు
- చెట్ల కిందే వైద్య సేవలు

ప్రజాశక్తి - సీతంపేట

వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికే సచివాలయాల పరిధిలో హెల్త్ వెల్నెస్ సెంటర్లు మంజూరు చేసింది. ఈ కేంద్రాల పరిధిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని, అందుకు అనుగుణంగా అక్కడే మందులు, ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు ఉంచుకోవడంతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులు కూడా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను మంజూరు చేసింది. ఆశయం గొప్పదే అయినా ఆచరణలో మాత్రం ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందాన పనులు జరుగుతున్నాయి. వెల్నెస్ సెంటర్లు మంజూరై మూడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమో, కాంట్రాక్టర్ల అలసత్వమో గానీ పనులు మాత్రం నత్తనడన జరగడంతో పలుచోట్ల చెట్ల కిందే వైద్యసేవలందించాల్సిన దుస్థితి నెలకొంది.

సీతంపేట డివిజన్లో సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం తదితర మండలాల్లోని 62 హెల్త్ వెల్నెస్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కొక్క భవనానికి రూ.18 లక్షలు కేటాయించారు. ఇప్పటికీ కేవలం 13 కేంద్రాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో తొమ్మిది పూర్తి కావడానికి సిద్ధం చేస్తున్నారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ల పనులు నిర్వహిస్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ దీన్ని పర్యవేక్షిస్తుంది. మూడేళ్లయినా కనీసం సగం కూడా పనులు పూర్తిగా కాకపోవడంతో ఎందుకింత జాప్యం జరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు పూర్తికి చర్యలు

హెల్త్ వెల్నెస్ సెంటర్ల పనులు సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికి 22 పూర్తి చేశాం. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. నేను ఇఇగా బాధ్యతలు స్వీకరించి 15 రోజులు కావస్తుంది

ఎస్ సింహాచలం
ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ, సీతంపేట

పెదరామంలో నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్

ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ వెల్నెస్ సెంటర్ ఉంటుంది. ఈ సెంటర్‌కు (ఎంఎల్‌హెచ్‌పి) మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడ్ హెల్త్ సిబ్బంది వీరి పరిధిలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉంటారు. వెల్నెసె సెంటర్ ద్వారా 64 రకాల మందులు, 14 రకాల పరీక్షలకు సంబంధించి సామగ్రిని సెంటర్లో భద్రపరుస్తారు. ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు వెల్నెస్ సెంటర్లో నిర్వహించాలి. దాదాపు సెంటర్ పరిధిలో కనీసం రెండు పంచాయతీలకు సంబంధించిన రోగులకు వైద్యం అందిస్తారు. హెల్త్ వెల్నెస్ సెంటర్లు పనులు పూర్తిగా కాకపోవడంతో ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనం ఆరుబయట చెట్లు కింద క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ వాహనం నెలకు 26 రోజులు వెల్నెస్‌సెంటర్ వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు నిర్వహిస్తారు. వర్షాకాలంలో ఇంకా ఎక్కువ ఇబ్బందులు ఉంటాయి. అంతేకాకుండా వెల్నెస్ సెంటర్లు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో మందులు, ల్యాబ్ పరికరాలు పరాయి పంచన నిల్వ ఉంచాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెల్త్ వెల్నెస్ సెంటర్ల పనులు శరవేగంగా పూర్తి చేయాలని ప్రజలు, వైద్యులు కోరుతున్నారు.

డివిజి శంకరరావును అభినందిస్తున్న జయమణి

డివిజిని కలిసిన జయమణి

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ డివిజి శంకర్రావును ఆదివారం ఎస్‌సి కమిషన్ సభ్యులు సవరపు జయమణి ఆదివారం ఆయన స్వగ్రహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

11న వీరఘట్టంలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో గల కత్తులకవిటిలో ఈనెల 11న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాదు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులంతా ఉదయం 10 గంటలకే సమయం పాటించి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

శ్మశానాల్లో కనీస సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలోని శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని జనసేన నాయకులు కోరుతున్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ పట్టణంతో పాటు జిల్లాలోని ఆయా గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాల్లో గల శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పట్టణంలోపి బెలగాం, కొత్తవలస, జగన్నాథపురం, బైపాస్ రోడ్, చర్చివీధి, ఎస్ఎన్‌పి కాలనీ, రెడ్డి వీధి చివర తదితర ప్రాంతాల్లోని శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు లేక మృతదేహాలను దహన సంస్కారాలు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశాన వాటికకు రాకపోకలు సాగించేందుకు రహదారి సదుపాయం లేక మృతదేహాలను తీసుకువెళ్లే ఆ నలుగురు నడిచేందుకు కనీస రహదారి లేక అవస్థలు పడుతున్నారని, ఇక వర్షాకాలం వస్తే మోకాలు లోతు బురదలో దిగి మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన దుస్థితి ఉందని విమర్శించారు. శ్మశాన వాటికలో నీటి సదుపాయం, మృతదేహానికి దహన సంస్కారాలు చేసేందుకు అవసరమైన షెడ్డు, అక్కడకు వచ్చే వారు సేదతీరేందుకు నీడ కోసం అవసరమైన షెడ్డు, ప్రహరీలు, గేట్లు తదితర సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అన్నారు. ఇందులో కొన్ని కబ్జాలకు గురయ్యాయన్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు, పాలకుల వద్ద మొంపెట్టుకున్నా ఫలితం లేదని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ వద్ద వాపోయినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ నివాసం ఉండే బెలగాం ప్రాంతానికి చెందిన శ్మశాన వాటికల పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి పార్వతీపురం లోని శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో జనసేన ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు వి.దాలి నాయుడు, కె.విశ్వేశ్వరరావు, జి.గౌరీశంకరరావు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కె.వెంకటరావు, ఎస్.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన తాగునీరు

పట్టణ ప్రజల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా పార్వతీపురం పట్టణానికి వర్షాకాలంలో రంగు మారిన తాగునీరు సరఫరా జరుగుతోంది. దీంతో పట్టణ మహిళలు, ప్రజలు మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కొళాయిల ద్వారా రంగుమారిన తాగునీరు సరఫరా చేయడంతో గత్యంతరం లేక ఆ నీటినే పట్టుకునే దుస్థితి నెలకొంది. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాపై ప్రతిఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఈ సమస్య ప్రతి ఏడాది పునరావృతమవుతుందని, ఈ నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఈ విషయంపై చొరవ చూపకపోవడమేమిటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇదే పరిస్థితి కొనసాగితే తాగునీరు సేవించి ప్రజలు అనారోగ్యంబారిన పడి ఆసుపత్రుల పాలయ్యే అవకాశం ఉంది. రంగు మారిన తాగునీటి సరఫరాపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి, పట్టణ ప్రజలకు శుద్ధ తాగునీటి జలాలను సరఫరా చేయాలని కోరుతున్నారు..

కుళాయిల ద్వారా బురదతో వస్తున్న తాగునీరు

ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పంపులు

మరుపెంటలో ఏనుగుల సంచారం

డ్రిప్ ధ్వంసం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలో గడిచిన ఐదురోజుల గొట్టివలసలో తిష్ట వేసిన ఏనుగులు ఆదివారం మరుపెంట గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్నాయి. దాదాపు నాలుగు రోజులుగా గొట్టివలస పరిసరాల్లో తిష్ట వేసిన ఏనుగులు నాటు బళ్లు, ట్రాక్టర్ తొట్టె, తౌడు బస్తాలుతో పాటు ఇంటి కిటికీలను ధ్వంసం చేశాయి. శనివారం రాత్రి ఈ ప్రాంతం నుంచి మరుపెంట తరలి వెళ్లాయి. అయితే మరుపెంట తరలి వెళ్లిన ఏనుగులు ఎంపిపి ఉరిటి రామారావు పొలంలో ఇటీవల వేసిన డ్రిప్ సిస్టంతో పాటు దాదాపు అరఎకరా పొలంలో వేసిన పామాయిల్ మొక్కలను ధ్వంసం చేశాయి. ఏనుగులు డ్రిప్పు సిస్టంను ధ్వంసం చేయడంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోయిందని ఎంపిపి తెలిపారు. డ్రిప్ సిస్టంతో పాటు పామ్ ఆయిల్ మొక్కలను ధ్వంసం చేసిన విషయం అటవీ శాఖఅధికారులకు తెలిపినా తాము ఏం చేస్తామని సమాధానం చెబుతున్నారని ఎంపిపి తెలిపారు. సుమారు రూ.4లక్షలు వరకూ నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమేఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సైన్స్‌తోనే మనుగడ

ప్రజాశక్తి-బొబ్బిలి

సైన్స్‌తోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, అలాంటి సైన్స్‌తోపాటు చరిత్ర పాఠ్యాంశాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం అన్యాయమని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామ్మూర్తి, ఎస్‌టియు నాయకులు జెసి రాజు, ఎయిడెడ్ టీచర్స్ యూనియన్ నాయకులు కె.కృష్ణదాస్, హిస్టరీ లెక్చరర్ వి.శంకరరావు అన్నారు. సైన్స్, చరిత్ర పాఠ్యాంశాల తొలగింపునకు వ్యతిరేకంగా ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌జిఒ హోంలో యుటిఎఫ్ నాయకులు వై.స్వామినాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పౌరులకు విలువలతో కూడిన విజ్ఞానాన్ని అందించాలంటే, రాజ్యాంగ విలువలు అమలు కావాలంటే చరిత్ర పాఠ్యాంశాలు తొలగించకూడదన్నారు. మానవ జీవన గమనమే సైన్స్ అని, అటువంటి శాస్త్రాన్ని కనుమరుగు చేయాలని చూడటమేమిటని నిలదీశారు. మనువాద సిద్ధాంతాన్ని తీసుకురావడమంటే భావిభారత పౌరులకు ఏమీ తెలియకుండా చేయడమేనన్నారు. కేంద్రం నిర్ణయాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నిరూపణకు నిలబడే సైన్స్‌ను నేర్చుకోకుండా చేసే చర్యలు నూతన విద్యా విధానం నుండే రూపొందించారని, ఇటువంటి విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. విద్యారంగం తిరోగమన చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సైన్స్, చరిత్ర తొలగింపును వ్యతిరేకంగా ఈ నెల 15న పట్టణంలో ప్రదర్శన చేపట్టేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఆనెం శ్రీనివాస్, గ్రీన్ బెల్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, ఎన్‌జిఒ నాయకులు రామారావు, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం వారి కుటుంబాలతో కలుసుకున్నారు. చిన్ననాటి తమ స్నేహ సంబంధాల గురించి నెమరు వేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని నిశ్చయించుకున్నారు. అలాగే ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్ జి .నరసింహులు శ్రీనివాసరావు సేల్స్ మాన్ దుర్గారావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు

తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం క్లస్టర్ రెల్లలో సర్పంచ్ మండంగి శంకర్రావు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజామృతంతో సామూహికంగా 30మంది రైతులతో విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. వరిలో వచ్చే అగ్గితెగులు, ఎండు తెగుళ్లను సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రతి రైతు బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలని సర్పంచ్ కోరారు. తక్కువ దిగుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ప్రతి రైతు పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి సిబ్బంది యాంకర్ కె.సతీష్, పి.శకుంతల, మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.